మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

బొడ్డు వెంకటరమణ చౌదరి

విశాలాంధ్ర - సీతానగరం: రోడ్డు ప్రమాదంలో మృతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం అని రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మండలంలో రాజంపేట గ్రామంలో శనివారం ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించిన దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం రాజంపేట సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరమణ చౌదరి విలేకరులతో మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలోని రాజమండ్రి నుండి సీతానగరం వరకు స్టేట్ హవే క్రింద మంజూర అయిందని అప్పుడు కొన్ని సర్వేలు కూడా జరగాయని అన్నారు. అలాంటి ఈ రోడ్డు నిర్మాణం గత నాలుగున్నర సంవత్సరాలుగా జరుగుతుందని అన్నారు. అలాగే చేపడుతున్న రోడ్డు నిర్మాణం నాణ్యతతో సాగడం లేదని గ్రామస్తులు కొన్నిచోట్ల అడ్డుకోగా స్థానిక ఎస్సై సహాయంతో వారిపై కేసులు నమోదు చేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ రోడ్డు విషయంపై ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని అలాగే రోడ్డు నిర్మాణం నాణ్యతతో చేపట్టాలని, మరణించిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వారికి అర్జీ చేస్తామని అప్పుడు కూడా న్యాయం జరగకపోతే టిడిపి ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గద్దె సురేష్, కృష్ణ చైతన్య, వలవల రాజా, పోలిన కృష్ణ, అసెన్ బాబు, సతీష్, పెందుర్తి బాబ్జీ, గుడిపాటి శ్రీనివాస్, పుక్కల శ్రీను మొదలగు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు జగనే కావాలి

విశాలాంధ్ర - నిడదవోలు : బడుగు బలహీనవర్గాలకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పథకాలు అమలు జరగాలంటే మళ్ళీ జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా కావాలని పట్టణ వైసీపీ జెసిఎస్ కన్వీనర్ చాంద్ బాషా అన్నారు. ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక 1వార్డులో జగనే ఆంధ్రప్రదేశ్‌కి ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ప్రభుత్వ పథకాలనుషేక్ ఛాన్ బాషా వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి,పట్టణ వైస్సార్సీపీ అధ్యక్షుడు ముగండి కృపానందం, వార్డు కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్,ఆకుల ముకుందరావు, కొత్తపల్లి సుప్రియ,వైస్సార్సీపీ నాయకులు గంగుల గోపీ యాదవ్,ఆలమూరు రాజా, పాషా పాల్గొన్నారు.

కార్మిక, రైతాంగ వ్యతిరేక సమస్యలపై పోరాడుదాం

విశాలాంధ్ర - గోపాలపురం : కార్మిక రైతాంగ సమస్యలపై విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు కూలి సంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో దొండపూడిలో ప్రదర్శన కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా విజయవాడలో జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని రైతు కూలి సంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో గోపాలపురం మండలంలోని దొండపూడి సంత బజారులోను, ప్రధాన వీధుల్లోనూ ప్రదర్శన నిర్వహించడం. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు కూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్) జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ ఢిల్లీలో పోరాడిన రైతాంగానికి నరేంద్ర మోడీఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస మద్దతు గిట్టుబాటు ధరల చట్టాన్ని తీసుకురావాలని, కార్మికులకు గుదిబండలా మారిననాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, మహా ధర్నా జరగనుందని రైతాంగం - కూలీలు- గిరిజనులు ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజ రామారావు జిల్లా నాయకులు సవలం రాంబాబు, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముప్పిడి రాజారత్నం తదితరులు నాయకత్వం వహించారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర - నిడదవోలు : వైసీపీ ప్రభుత్వం ఎస్సి, ఎస్టీనిధులను ప్రభుత్వ పథకాలకు దారి మళ్ళించడాన్ని నిరసిస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిడదవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహిం చారు. శిబిరానికి బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుమ్మాపు చిత్రసేను ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సి,ఎస్టీ ల ఆర్థిక అభ్యున్నతి కోసం ఖర్చు చెయ్యాల్సిన ఎస్సి,ఎస్టీ కాంపోనెంట్ నిధుల్ని వైసీపీ ప్రభుత్వం తమ సొంత పథకాలకు దారి మళ్లించి ఎస్సి,ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని, దాంతో ఆయా వర్గాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సుమారుగా 5 ఏళ్లలో లక్షా పదహారు వేల నూట పదకొండు కోట్లు నిధుల్ని దారి మళ్లించిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సి,ఎస్టీ నిధుల మళ్ళింపు విషయంలో తన వైఖరి మార్చుకోకపోతే బియస్పీ తమ పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేసి జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ దీక్షలో ఏలూరి అశోక్ కుమార్, సిర్రారాజు, నల్లి రమేష్,బయ్యే మునేంద్ర,వెన్నపు సుధాకర్,బత్తిన ఆశీర్వాదము,మర్రి మహా లక్ష్మడు, బద్దాజాన్, అంబటి పుల్లారావు,మల్లపు నాగరాజు,అచ్చి బాబు,జియస్ రావు,గొల్ల ధనరాజు,రాఘవ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి విశేష కృషి

విశాలాంధ్ర - అనపర్తి : గ్రామాభివృద్ధికి సత్తి సూర్య బ్రహ్మానందరెడ్డి విశేష కృషి చేశారని ఇటువంటి ప్రజా సేవసకుని విగ్రహం ఆవిష్కరించడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. శనివారం కుతుకులూరులో మాజీ సర్పంచ్, కీర్తిశేషులు సత్తి సూర్య బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకులు సత్తి రామారెడ్డి, సర్పంచులు గొల్లు హేమతులసి, నల్లమిల్లి కాంతమ్మ (పెదపర్తి), ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేగల రాము పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర కొవ్వూరు : కొవ్వూరు పట్టణ జనసేన అధ్యక్షులు దేగల రాము పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ గత మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికలలో అధికార పార్టీ వైకాపా ఎన్ని ప్రలోభాలు ఎరచూపిన పోటీ నుండి తప్పుకోకుండా పోరాడిన వ్యక్తి రాము అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన యూత్, నాయకులు అధిక సంఖ్యలో హాజరై రాముకు శుభాకాంక్షలు అందజేశారు.

చేబ్రోలులో టీడీపీలోకి జోరుగా చేరికలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గ టిడిపి మాజీ ఎమ్మెల్యే వర్మ శనివారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మను ఆశీర్వదిద్దాం వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి ప్రభుత్వ హయాంలో చేబ్రోలులో చేసిన అభివృద్ధిని వివరించారు. అనంతరం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను మెచ్చి ఇతర పార్టీలను వీడి టిడిపిలోకి చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

27, 28తేదీల్లో మహాధర్నా జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - కాకినాడ : రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం 26,000 చెల్లించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందించాలని, ఉపాధి కార్మికులకు రోజుకి 600 వేతనం, 200 రోజుల పని దినాలు, పట్టణాల్లో కూడా అమలు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతాంగ సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నవంబర్ 27, 28 తేదీలలో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరగబోయే మహాధర్నా విజయవంతం చేయాలని కోరు తూ కాకినాడ జిల్లా భానుగుడి సెంటర్ వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా దేవాలయం వీధి నుండి అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, నగర కార్యదర్శి టి.అన్నవరం, కాశీ విశ్వనాథ్, కెవి రామయ్య, అనిల్, సత్య నారాయణ, ఎమ్మెస్ నారాయణ, సత్తిబాబు, సత్య శ్రీనివాస్, అప్పారావు, తంగెళ్ల నరసయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, నగర అధ్యక్షులు పలివేల వీరబాబు, రూరల్ కన్వీనర్ రాజా, మెడిశెట్టి వెంకట రమణ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, నగర అధ్యక్షురాలు భారతి, ఉమా, వరలక్ష్మి, బేబి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కాకినాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జ్యోతి, జిల్లా కోశాధికారి రమణమ్మ, ఐఎన్టియుసి ఏపీ అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరు రాజు, ఐఎన్టీయూసీ నాయకులు పి శివ, ఆర్ రమణ, బి సాయి, కృష్ణార్జునరావు, ఏపీఎంఎస్ఆర్ యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, నగర అధ్యక్షులు స్వామి, అమరావతి మినిగూడ్స్ యూనియన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సి-క్లాస్ లంక భూముల లీజు పట్టాల పంపిణీ

విశాలాంధ్ర పెరవలి : మల్లేశ్వరం గ్రామంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు ప్రభుత్వం చేపట్టిందని యం యల్ ఏ శ్రీనివాస్ నాయుడు అన్నారు. శనివారం మండలంలో గల మల్లేశ్వర గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ రైతు భరోసా కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. లబ్ధి దారులకు లంక భూముల లీజు పట్టాలను అందించారు. ఆయన మాట్లాడుతూ2013వ సంవత్సరం నుండి పరిష్కారం దొరకని సమస్యకు, మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించామన్నారు. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసే విధానంకు బదులుగా ఐదేళ్లకు రెన్యూల్ చేస్తూ పట్టాలు అందిస్తున్నారన్నారు. మల్లేశ్వరం గ్రామంలో లంక భూముల్లో వ్యవసాయం చేసుకునే 71మంది రైతులకు సి-క్లాస్ లంక భూముల లీజు పట్టాలను మంజూరు చేయించామన్నారు. మల్లేశ్వరం గ్రామంలో3.54 కోట్ల రూపాయలతో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ మంజూరు చేయించామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ, గ్రామ సర్పంచ్, రాష్ట్ర డైరెక్టర్, గ్రామ నాయకులు, కార్తకర్తలు, ఎమ్మార్వో, ఎండిఓ, వ్యవసాయశాఖ అధికారిని,స్థానికులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర పెరవలి : మండలంలో గల అన్నవరప్పాడు గ్రామంలో విచ్చేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆలయంలో శనిత్రయోదశి కావడంతో శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గన్నారని ఆలయ ఈఓ రాధకృష్ణ తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పట్లూ చేశామని తెలిపారు. ఇందులో భాగంగానే అన్నవరప్పాడు యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ సకుటుంబ సమేతంగా స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈఓ రాధాకృష్ణ ఆయనకి స్వామివారి చిత్రపటం అందించారు.

పుట్టిన రోజు వేడుకలకు దూరంగా సేవా కార్యక్రమలకు దగ్గరగా చిర్ల జగ్గిరెడ్డి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజక వర్గంలో సేవా కార్య క్రమాలతో తన జన్మదిన వేడుకలు జరుపుకున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి. నేడు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతో తన పుట్టిన రోజును జరుపుకోవాలని నిశ్చయించుకున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆలోచన మేరకు శనివారం రావులపాలెం మండలం, ఊబలంక గ్రామంలో గల మదర్ థెరిసా మనో వికాస కేంద్రం వద్ద రావులపాలెం చుట్టుపక్కల గల అనాధాశ్రమాలు, అంధుల పాఠశాలల బాలబాలికలతో కేక్ కట్ చేయించి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దివ్యాంగులకు కొత్త బట్టలు కొని, అందరికి అన్నదానం జరిపించారు. చిర్ల జగ్గిరెడ్డి ఈ 26న పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు తెలియచేశారు.

డస్ట్ బిన్నులు పంపిణీ

విశాలాంధ్ర - సామర్లకోట : క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో స్వచ్ సంకల్ప కార్యక్రమంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సామర్లకోట మండలానికి సంబంధించి 36 వేల తడి పొడి చెత్త డస్టబిన్‌లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గ్రామ పంచాయతీలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్తిబాబు, ఎమ్మార్వో కుమారి, ఎంపీడీవో శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

-ఒమ్మి రఘురామ్

విశాలాంధ్ర - జగ్గంపేట : భారత రాజ్యాంగంపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఒమ్మి రఘురామ్ అన్నారు. నేడు రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలోను, జూనియర్ కళాశాలలోను విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఈ. చంద్రనాయుడు అధ్యక్షతన జరిగిన రాజ్యాంగ దినోత్సవం, జాతీయ న్యాయ దినోత్సవ వేడుకల్లో రఘురామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మించిన గొప్ప ధర్మ శాస్త్రం మరొకటి లేదని, భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదించబడిందన్నారు. డా బిఆర్ అంబేద్కర్ 125 వ జయంతి పురస్కరించుకుని నవంబరు 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. రాజ్యాంగ అమలు లోనికి వచ్చిన 1950 జనవరి 26ని రిపబ్లిక్ డేగా జరుపుకుంటామన్నారు. అలాగే నెహ్రూ యువకేంద్రం అధ్వర్యంలో జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, నెహ్రూ యువ కేంద్రం అనూష, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ అలవాటు చేసుకోవాలి

టౌన్ సీఐ షేక్ అఖిల్ జమ

విశాలాంధ్ర - మండపేట : విద్యార్థులు చదువులతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని టౌన్ సీఐ షేక్ అఖిల్ జమ అన్నారు. తాపేశ్వరం శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులతో శనివారం ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కరాచీ సెంటర్ నుంచి విద్యార్థుల అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సీఐ అఖిల్ జమ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు అందరూ ట్రాఫిక్ రూల్స్ అలవాటు చేసుకోవాలన్నారు. ఇంటి నుంచి పాఠశాలలకు వివిధ ప్రాంతాలకు వెళ్ళే సమయంలో రోడ్లపై ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. అలాగే హెల్మెట్ కూడా తప్పని సరిగా ధరించాలని హితోపదేశం చేశారు. అనంతరం పెద్ద కాలువ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై కోన అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన

విశాలాంధ్ర - కాకినాడ : సచివాలయ, వాలంటరీ వ్యవస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తోందని దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పేర్కొన్నారు. అర్హతను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక 43వ డివిజన్ ప్రతాప్‌నగర్ ప్రాంతంలో జరిగిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ డిప్యూటీ మేయర్లు చోడిపల్లి సత్యప్రసాద్, మీసాల ఉదయ్‌కుమార్ ఉన్నారు.

జనార్ధన స్వామి తెప్పోత్సవం

విశాలాంధ్ర - మండపేట : శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ జనార్దన స్వామివారి తెప్పోత్సవం మండపేట పట్టణంలో శుక్రవారం రాత్రి కనుల పండుగగా జరిగింది. కార్తీక మాసం ద్వాదశి క్షీరాబ్ది పర్వ దినంను పురస్కరించుకుని పట్టణంలోని పాటిమీద అంకసాని చెరువులో నిర్వహించిన స్వామి వారి తెప్పోత్సవంను తిలకించేందుకు పట్టణం నలు మూలల నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అశేషంగా తరలి వచ్చి ఉత్సవాన్ని కనులారా వీక్షించారు. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ జనార్దన స్వామివారి తెప్పోత్సవంను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూర్యకుమారి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి ప్రారంభించారు. ఎమ్మెల్సీ తోట ప్రోత్సాహంతో స్వామి వారి పాలక మండలి, ఉత్సవ కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, యాంద్ర ప్రభాకరరావు, సిరంగు శ్రీనివాస్, కుక్కల రామారావు, సలాది అన్నవరం తదితర సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణిలు ముఖ్య అతిథిలుగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తొలుత పాలక మండలి చైర్మన్ సదపతి జయబాబు, ధర్మకర్తల సమక్షంలో ఉత్సవమూర్తులను స్థానిక రథంగుడి నుంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజారులు వేద మంత్రోచ్ఛారణ మధ్య మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను పల్లకిలో గోవింద నామ స్మరణ మధ్య ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకు వెళ్లి ప్రత్యేకంగా అలంకరించిన ఘవము (తెప్ప) పై కొలువు తీర్చారు. వైఎస్సార్సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, వైఎస్సార్సీపీ రాష్ట్ర నేత రెడ్డి రాజబాబు, ప్రముఖ వైద్యులు బిక్కిన పద్మ గోపాలకృష్ణ దంపతులు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు ప్రకాష్ పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారు చెరువు చుట్టూ మూడు సార్లు ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చి స్వామి వారి ఉత్సవాన్ని పట్టణం నలుదిక్కులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తహశీల్దార్ తంగెళ్ళ రాజరాజేశ్వరరావు తన సిబ్బందితో కలిసి ఉత్సవాన్ని తిలకించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రాలు, కూచిపూడి నృత్య ప్రదర్శన, శివ పార్వతులు ఋషుల వేషాలు, తీన్మార్, రికార్డింగ్ డాన్సులు వంటి అనేక కార్యక్రమాలు ఆద్యాంతం మంత్రముగ్దులను చేశాయి. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈఓ పీ కామేశ్వరరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టౌన్ సీఐ షేక్ అఖిల్ జమ నేతృత్వంలో టౌన్ ఎస్సైలు మద్దాల అశోక్ కుమార్, కోన అప్పారావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బృందాలతో సీఐ అఖిల్ జమ భక్తుల రద్దీని క్రమబద్దీకరించారు. 14 ఏళ్ళ తరవాత కనీవినీ ఎరుగని రీతిలో అంకసాని చెరువులో వైభవోపేతంగా తెప్పోత్సవం నిర్వహించారని తమకు చాలా ఆనందంగా ఉందంటూ హర్షాతి రేకాలతో ప్రజలు నిర్వాహకులకు అభినందనలు తెలియజేయడం గమనార్హం. కాగా చెరువు వద్ద బాణసంచా కాల్చుతుండగా కొబ్బరి చెట్టుపై జువ్వ పడి అంటుకుంది. ఎస్ఐ కోన అప్పారావు చూసి వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారులు వెంటనే స్పందించి మంటలను ఆర్పారు. పట్టణ ప్రముఖుడు బిక్కిన చిన్న, వైఎస్సార్సీపీ నాయకురాలు ఓగిరాల దేవి, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు మలసాని సీతా మహాలక్ష్మి, శెట్టి కళ్యాణి, నీలం దుర్గమ్మ, బొక్కా సరస్వతి, అమలదాసు లక్ష్మి, ఎర్నేని ప్రభావతి, ముక్కా లోవలక్ష్మి, ముక్కా మేరీ స్వరూపా రాణి, సిరంగు జ్యోతి ఈశ్వరరావులు దీపాలు వెలిగించి స్వామి వారి సేవలో తరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, కొప్పిరెడ్డి ప్రసాద్, ముక్కా సుబ్రహ్మణ్యం, టి పుల్లేశ్వరరావు, యరమాటి వెంకన్న బాబు, కొప్పిరెడ్డి పద్మావతి, టేకిముడి శ్రీనివాస్, మహిళలు చిన్నారులు వృద్దులు భారీగా పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

బాలోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి రెండవ బాలోత్సవం గోడ పత్రిక దేవరపల్లి మండలం ఎంపీపీ కుప్పల వెంకట కనక దుర్గారావు ఆవిష్కరించినారు. మాట్లాడుతూ దేవరపల్లి మండల లోని అన్ని గవర్నమెంట్ ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులకు ప్రతిభకు దోహదపడతాయని పేర్కొన్నారు. బాలోత్సవ కార్యక్రమానికి హార్దిక సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేసినారు. దేవరపల్లి మండల బాలోత్సవ కమిటీ అధ్యక్షులు బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ దేవరపల్లి మండల బాలోత్సవ కార్యక్రమం డిసెంబర్ 7వ తారీకు మార్పు చేసి డిసెంబర్ 13వ తారీకున నిర్వహిస్తున్నామని తెలియజేశారు. పాఠశాలలో డిసెంబర్ 6 వ తారీకు వరకు పరీక్షలు ఉన్న ఎడల తారీకు కమిటీ సభ్యులు డిసెంబర్ 13కు మార్చడం జరిగింది. బాలోత్సవ కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, కూచిపూడి సత్యనారాయణ, నల్లమాటి రామారావు పాల్గొన్నారు

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

విశాలాంధ్ర-చాగల్లు: పేదప్రజలకు ఆహారం, వైద్యం, విద్య, ఉపాధి, న్యాయ విషయలలో ఉచితంగా సహాయ సేయుటకు ఎల్లపుడు కొవ్వూరు లోని మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ అందుబాటులో ఉంటుంది అని సంస్థ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు అన్నారు. ఉచిత సేవ కార్యక్రమలలో భాగంగా చాగల్లు మండలం, కలవలపల్లి గ్రామంలో సుమారు నిరుపేదలైన 15 కుటుంబాలకు 15 కేజీలు చొప్పున నాణ్యమైన బియ్యం ఉచితంగా గ్రామ వైస్ సర్పంచ్ అయిన కొండేపాటి హరినాథ్, పార్టీ నాయకులు అయిన గుడపాటి శివ, ప్రతిపాటి రామచంద్రా రావు, గ్రామ సర్పంచ్ ఆకుల లక్ష్మి మురళి, గ్రామ ఎం పి టి సి అయిన చాపల వెంకటరావు అందజేశారు అంతేకాకుండా ఈ గ్రామలో 5 గురుకి ప్రతి నెల 1 తారీఖున ఇచ్చే మెడికల్ పెన్షన్ కొరకు ఎంపిక చేసారు ఈ కార్యక్రమలో గ్రామపెద్దలు అయిన విజయరాజు, భద్రంపాల్, సత్యనంద, దానియిల్, జోషి, చదలవాడ కుమార్, అయిన సుబ్రహ్మణ్యం,మట్టా నాగహేశ్వరావు, కారింకి కోటేశ్వరరావు పాల్గొన్నారు

జాతీయ ఫార్మసీ వారోత్సవాల ర్యాలీ

విశాలాంధ్ర-గోకవరం: నేడు ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ డి ఫార్మసీ, బీఫార్మసీ, ఎం ఫార్మసీ మరియు ఫార్మా డి విద్యార్థిని విద్యార్థులచే చైర్మన్ కనకరాజు ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు మాట్లాడుతూ మా ఆదర్శ కళాశాల విద్యార్థులచే నేడు గోకవరంలో ఎల్ఐసి ఆఫీసు నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ గా మందులను సకాలంలో వాడాలని, భయం వేడండి ఫార్మసిస్ట్ మీ వెన్నంటే ఉన్నారు అని నినాదంతో ర్యాలీ కొనసాగిందని తెలియజేశారు. వ్యాధి నిర్ధారణ చేయడంలో డాక్టర్ యొక్క పాత్ర ఎంత ప్రధానము వ్యాధిని నివారించడంలో ఫార్మసిస్ట్ యొక్క పాత్ర అంతే ముఖ్యమని సెక్రటరీ డాక్టర్ నాగమణి తెలియజేశారు. ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ ఉంటారని, విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఇటువంటి కార్యక్రమంలో పాల్గొంటారని వైస్ ప్రిన్సిపల్ సుజిని తెలియజేశారు. ఈ ర్యాలీలో సుమారు 300 మంది విద్యార్థులు మరియు ఉపాధ్యాయ బృందం కామేష్ ప్రేమ్ కుమార్, సంకీర్తన, గణేష్ ఆషిక పద్మ, దీప్తి , దీపిక, రామలక్ష్మి, వలస రెడ్డి, మాధురి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి..

విశాలాంధ్ర - కొవ్వూరు : న్యాయవాదులు న్యాయవాద గుమస్తాలు పని ఒత్తిడి ఉన్నా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని... కొవ్వూరు తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి ఎన్ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా జడ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో న్యాయమూర్తులు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే జరిగే పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బాలా త్రిపుర సుందరి, జి ధర్మారావు,జి సాయి కృష్ణ,బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బ భారతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

చండీ హోమంలో బత్తుల బలరామకృష్ణ

విశాలాంధ్ర-దేవరపల్లి : గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు జన సైనికులతో కలిసి రాజానగరం నియోజకవర్గంలో గాడాల గ్రామంలో జరిగిన శ్రీ రాజ శ్యామల చండీ హోమానికి హాజరయ్యారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బత్తుల బలరామకృష్ణ దంపతులతో నిర్వహించిన శ్రీ రాజా శ్యామల చండీ హోమంలో పాల్గొన్న సందర్భంగా బల రామకృష్ణ బాల రామకృష్ణ దంపతులు డి.సువర్ణ రాజును ఘనంగా సత్కరించారు. శక్తిపీఠాల చిత్రపటాలను సువర్ణ రాజుకు అందజేశారు. సోమరాజు మాట్లాడుతూ శ్రీ రాజా శ్యామల చండీ హోమంలో పాల్గొనటం తన పూర్వజన సుకృతము అన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కంబాల సత్తిబాబు కాళ్ళ వెంకటరత్నం చప్పటి శివ నాగ ప్రసాద్ జాజిమొగ్గల శ్రీనివాస్ సూరిశెట్టి బాలు ప్రదీప్ సిద్ధ తాతబ్బాయి నాగరాజు కావాలా సీతారత్న సూర్య కుమారి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా

విశాలాంధ్ర - కాకినాడ : సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీ రథచక్రాలు అని, రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండ బాబు అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం కొండబాబు 12వ డివిజన్ నందు పర్యటించి, మహానాడు వేదికగా చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల సునీత రమేష్, ఒమ్మి బాలాజీ, కడలి వెంకటరమణ, పేకేటి భాస్కరరావు, తుమ్మల కొండలరావు, ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబా, తిరిది ఎల్లయ్యమ్మ, దూడ పావని, మూగు రాజు, దుంప సూర్యకుమారి, గంపల లక్ష్మణరావు, కసింకోట చంద్రశేఖర్, ఆదిలక్ష్మి, స్వాతి, రమాదేవి, రామలక్ష్మి, గుత్తుల రమణ, చౌదుపిల్లి సతీష్, బంగారు సత్యనారాయణ, గాది శివ, మూగ రాజు, సబ్బి శ్రీను, బాసి రమణారెడ్డి, కొండ్రు తాతారావు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడ్డ అధికారిని సస్పెండ్ చేయండి

: ఎమ్మెల్యే నిమ్మల

(విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు మున్సిపాలిటీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేశారు పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు. శనివారం పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో ఆయన మీ మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్న అధికారులపై ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోవడం లేదన్నారు. మొక్కుబడిగా ట్రాన్స్ఫర్ అని చేస్తున్నారన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఆయన మీడియా ముందు ఉంచారు. అవినీతికి పాల్పడిన అధికారి ఎంతటి వారైనా తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

వైసీపీ ప్రభుత్వం పతనం తథ్యం

- టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు

విశాలాంధ్ర ఏలూరు: వైసిపి పతనం తథ్యం అని టిడిపి ఎస్ సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు తెలిపారు. శనివారం స్థానిక టొబాకో మర్చంట్ కళ్యాణ మండపంలో దళితులపై దాడులకు నిరసనగా దళిత శంఖారావం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్ రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, జగన్ను రాజకీయ సమాధి చేయాలన్నారు.రాష్ట్రంలో దళితులపై దాడులు నానాటికి పెరుగుతున్నాయన్నారు. సాక్షాత్తు హోం మంత్రి ఇలాకాలో దొమ్మేరులో వైసీపీకి చెందిన మహేంద్ర ఆత్మహత్య చేసుకుంటే దిక్కే లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో కోటి మంది దళితుల జనాభా ఉన్నా నేటికీ వివక్షత కొనసాగుతుందన్నారు. వెనుకబాటుతనంలో ఉన్న జాతి పోరాటం చేస్తే తప్ప అభివృద్ధి చెందదన్నారు. ప్రస్తుత పాలనలో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, నిత్య కృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత జాతి అభివృద్ధి కోసం భయాన్ని విడనాడి పోరాటాలు చేస్తేనే మనుగడ ఉంటుందని లేదంటే నిర్వీర్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో ఆలోచన చేయాలన్నారు. దళితులందరూ లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని బానిసత్వాన్ని పోగొట్టుకోవాలన్నారు. చరిత్రను తిరగరాయాలని కోరారు. దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. టిడిపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కేఎస్ జవహర్, మాజీ మంత్రి పీతల సుజాత, గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జి మద్దిపాటి వెంకటరామరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ, ఆకుమర్తి రామారావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు యాళ్ల సుజీరావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చుక్క సాయిబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ సమన్వయ కమిటీ నాయకులు నేతల రవి, పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పీతల శ్రీనివాస్, తెదేపా నాయకులు బొమ్మజీ అనిల్, తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు ఉన్న మట్ల సునీత తదితరులు ప్రసంగించారు.

దాళ్వా పంటలకు కార్యాచరణ ప్రణాళికలు

విశాలాంధ్ర ఏలూరు: దాళ్వాలో నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలు వేసుకోవలసినదిగా, బోర్ల క్రింద వరి పంటను వేయవద్దని రైతాంగానికి జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ సూచించారు.నవంబరు నెల రైతు భరోసా శిక్షణ, సందర్శనకార్యక్రమం శనివారం ఏలూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో విజయరాయి వ్యవసాయ పరిశోధనాకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.కె.మోహనరావు, జిల్లా వ్యవసాయ అధికారి డా.వై.రామకృష్ణ, వారి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏలూరులోని 7వ్యవసాయ డివిజన్ల సహాయ వ్యవసాయ సంచలకులువారు పాల్గొనడం జరిగింది. వారి వారి సబ్ డివిజన్ లలో నెలకొన్న పంటల స్థితి గతులు, వాతావరణ పరిస్థితుల గురించి తెలియజేస్తూ వివిధ సమస్యలను వ్యక్తపరిచారు. అపరాలలో విత్తన శుద్ధి ఆవశ్యకత మరియు కలుపు యాజమాన్యం, పంట రకాల గురించి డా. వి.సుజాత కో-ఆర్డినేటరు , ఏరువాక కేంద్రం, ఏలూరు వారు తెలియజేస్తు రైతులకు సూచించవలసినదిగా కోరారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు పోర్టాంజియ డ్యూయో (సయాంట్రనిలిప్రోల్ ం థయోమిథాక్సామ్) (6 గ్రా/కే.జి. విత్తనానికి) తో విత్తన శుద్ధి చేయవలసినదిగా, తర్వాతి దశలలో స్పైనోటేరం 100 మి.లీ./ఎకరానికి లేదా సయాంట్రనిలిప్రోల్ 80.మి.లీ./ఎకరానికి పిచికారీ చేయవలసినదిగా డా. కె.ఫణి కుమార్ సూచించారు.

రెల్లి కులస్తులకు స్మశాన వాటిక కేటాయింపు

విశాలాంధ్ర పెంటపాడు: మండలం పెంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గల రెల్లి కులస్తులకు 35 సం ""ల క్రితం నుండి స్మశాన వాటిక లేదు, ఎప్పటికి అప్పుడు రెల్లి కులస్తులం అందరు ప్రభుత్వాలతో పోరాడిన గత ప్రభుత్వాలు స్థలం కేటాయించలేదని,ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం లో ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా 10 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తూ పట్టాను ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా రెల్లి కులం నాయకులు తాడికొండ వాసు మాట్లాడుతూ స్మశాన వాటికను కేటాయించిన ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మదాయ శాఖా మంత్రి కొట్టు కు, రెల్లి కులస్తులు తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్య కళకు, మాకు ఈ స్మశాన వాటిక రావడానికి ముఖ్య కారణం సిపిఐ పెంటపాడు మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధుసూదన్, జిల్లా నాయకులు ధనాల శంకర్, భౌరిశెట్టి శ్రీను, తాడేపల్లిగూడెం రెల్లి కులం నాయకులు ధనాల దానయ్య, టి. జయరాం, టి. శ్రీను, బి. లక్ష్మి,కిషోర్, కోటి, కోన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు

విశాలాంధ్ర, వీరవాసరం: కార్తీక త్రయోదశి సందర్భంగా రాయకుదురులో వేంచేసి యున్న శ్రీ ఉమా మూలేశ్వరస్వామి దేవస్థానం శివాలయం లో బ్రహ్మశ్రీ నుదురుపాటి కోదండ రామమూర్తి శ్రీమతి సీతామహాలక్ష్మి వేద పరిరక్షణ సమితి రాయకుదురు, హైదరాబాద్ వారిచే మూలేశ్వర స్వామి వారికి వివిధ రకాల పళ్ళరసాలతో అభిషేకాలు, రుద్రాభిషేకము, లక్ష బిల్వార్చన వినాయకునికి గరిక పూజ, పార్వతి దేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన అనంతరం దేవేరులకు వివిధ రకాల పుష్పములతో అలంకరణ, అనంతరం12 రకాల దివ్య హారతులు సమర్పించినారు. రాయకుదురు తోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన 15 మంది వేద పండితుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఆకట్టుకుంది. పూజలు, అభిషేకాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కాయల నానిబాబు, బ్రహ్మశ్రీ నుదురుపాటి గంగాధర శాస్త్రి, బ్రహ్మశ్రీ భానుమూర్తి, బ్రహ్మశ్రీ రామ శర్మ, బ్రహ్మశ్రీ గణపతి, బ్రహ్మశ్రీ సతీష్ కుమార్ శర్మ, బ్రహ్మశ్రీ నియోగిశాస్త్రి, ఆలయ అర్చకులు శంకరమంచి రఘురాం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే ప్రభుత్వానికి చెడ్డపేరు

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రభుత్వానికి చెడ్డపేరు మండల సమావేశంలో సభ్యుల ధ్వజం అధికారులు సరియైన సమాచారం సభ్యలకు అందిచకపోవడం వల్ల ఎక్కడ ఏ విధమైన పనులు చేపట్టాలో తమని ఎన్నుకున్న ప్రజలకు చెప్పలేక పోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఎంపిటీసిలు, సర్పంచులు ధ్వజమెత్తారు. శనివారం ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దంగేటి అచ్చుత జానికి అధ్యక్షతన జరిగిన సమావేశం వాడి వేడిగా జరిగింది. అధకారులు సరియైన నివేధికలు ఇవ్వకపోవడంవల్ల వేటికి ఎన్ని నిధులు విడుదలైంది సభ్యులకు తెలియడంలేదని జడ్పిటిసి గెడ్డం సంపదరావు మాట్లాడుతూ ప్రతి అధికారి వారిశాఖల ద్వారా చేపడుతున్న పనులపై సమగ్ర నివేధికతో సమావేశాలకు రావలసివుందని ఆ విధంగా రానివారి పట్ల కతఠినంగా వ్యవహరించక తప్పదని ఆయన అన్నారు. మండలంలో సన్నవిల్లి ఎన్ కొత్తపల్లి పెదగాడవిల్లి గ్రామాలలో బియ్యం సరఫరా సక్రంగా జరగడం లేదని ఆయా గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు ఆరొపిస్తు బియ్యం సరఫరా చేసేందుకు నియమించిన వారిని తొలగించాలని డిమాండ్ చేసారు.

యువ గళం పాదయాత్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్రను విజయవంతం చేయాలి అని పి.గన్నవరం నియోజకవర్గ టూ మేన్ కమిటీ సభ్యులు నామన రాంబాబు తెలిపారు. శనివారం పాసర్లపూడి గ్రామంలో పి.గన్నవరం నియోజకవర్గ స్థాయి టిడిపి జనసేన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నామన మాట్లాడుతూ అధికార పార్టీ అక్రమ అరెస్టులతో నిలిచిన లోకేష్ పాదయాత్ర పున ప్రారంభం అవుతున్న తరుణంలో టిడిపి, జనసేన పార్టీల శ్రేణులు వేలాదిగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చి రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపికి మద్దతు ఇచ్చి ఇరుపార్టీలు ఉమ్మడి కార్యచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం అని దీనిలో భాగంగానే కోనసీమ జిల్లాలో జరిగే యువ గళం పాదయాత్రలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో రావాలని కోరారు. ఉమ్మడి పార్టీల నాయకులు ఆయా గ్రామాల నుండి భారీ సంఖ్యలో జన సమీకరణ చేయాలని పొదలాడలోని శుభం గ్రాండ్ ఫంక్షన్ హాల్ వద్ద స్వాగతం పలకాలని అనంతరం తాటిపాకలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొని పార్టీ గలాన్ని వినిపించాలని అన్నారు. బహిరంగ సభ అనంతరం పాశర్లపూడిలో రాత్రి బస చేస్తారని, మర్నాడు ఉదయం పాదయాత్ర తిరిగి ప్రారంభం అవుతుందని వైనతేయ వారధి మీదుగా అమలాపురం నియోజకవర్గంలోకి యువ గళం పాదయాత్ర చేరుకునే వరకు ఇరుపార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, టిడిపి నేతలు డొక్కా నాగబాబు, మోకా ఆనంద సాగర్, బోనం బాబు, మద్దాల కృష్ణమూర్తి, చుట్టుగుళ్ల కిషోర్, జనసేన నేతలు శిరిగినీడి వెంకటేశ్వరరావు, అడబాల తాతకాపు, కంకిపాటి నరసింహారావు, కొమ్ముల జంగమయ్య, తుండూరు బుజ్జి, కొమ్ముల కొండలరావు ఉన్నారు.

రామాలయ భూమి పూజలో కురసాల

విశాలాంధ్ర - కరప : కరప గ్రామం నక్కవారిపేటలో ఆలయ కమిటీ సభ్యులు సాదే వీర రాఘవులు నక్క సత్యనారాయణ, గుబ్బల సత్తిబాబు ఐనవిల్లి శ్రీనుబాబు, బళ్ళ ఉదయ్ కుమార్, గుబ్బల లోవరాజు, నక్క కృష్ణ, మోకన రాజు, గొడుగు శ్రీను ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రామాలయ భూమి పూజ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కమిటీ సభ్యులు కురసాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితులు అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు చాగంటి సూరిబాబు శాస్త్రోక్తంగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ రామాలయం నిర్మాణం నా చేతుల మీద జరగడం నా పూర్వజన్మ సుకృతం అని కొనియాడారు. అనంతరం నక్కవారిపేటలో ఉన్న అంబేద్కర్ విగ్రహాని స్లాబ్ వేసేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సాదె ఆశాజ్యోతి కుమార్ నెడ్ కేఫ్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి వీర రాఘవులు తాసిల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఎంపీడీవో కే అప్పారావు, డిప్యూటీ తాసిల్దార్ అనిల్, ఆర్ఐ మాసరావు, రెడ్డిపల్లి నారాయణరావు, చాగంటి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మార్వో చింత శివరామకృష్ణ, చింత ఈశ్వరరావు, చింత బుజ్జి, సవిలే రాజేష్, చిన్నం వెంకటేశ్వరరావు, నక్క విద్యాసాగర్, కేవివి సత్యనారాయణ, దేవుడ జమిందార్, గంధం పెదబాబు, గొర్రెల వెంకన్న, భోగి రెడ్డి సూర్యనారాయణ, మురళి, నక్క సత్తిబాబు, శ్రీను, గోవిందు, అంజి తదితరులు పాల్గొన్నారు.

27న నగర పంచాయతీ సమావేశం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 27న ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి లోవరాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ సమావేశపు మందిరంలో సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు కౌన్సిలర్స్ హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

30వరకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా కాకినాడ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పిస్తున్నామని సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. శనివారం కాకినాడలోని రమణయ్యపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకొని శిబిరాలను ప్రారంభించామన్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. జీవన శైలిలో మార్పులు, రోజువారీ ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణీత సమయంలో వ్యాయామం, ప్రాణాయామం వంటివి ఎంత అవసరమో వివరిస్తున్నామని చెప్పారు. బీపీ, షుగర్తో బాధపడేవారు వైద్యులు, డైటీషియన్ల సూచనలను పాటించాలని కోరారు. తద్వారా మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఉచిత వైద్య శిబిరాల్లో ఎటువంటి రుసుము లేకుండా ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల ప్రేమగా మెలగాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ స్థానిక గాంధీనగర్ అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో క్లబ్ కోశాధికారి అలై కొత్త మెహెర్ శ్రీరాములు తండ్రి వర్ధంతి సందర్భంగా వారి ఇంటి వద్ద పేద, అనాధ బాలలకు అన్నదానం నిర్వహించి పెన్నులు, పుస్తకాలు, స్నాక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా క్లబ్ పూర్వ గవర్నర్ అలై కె మునిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ శ్రీరాములు తండ్రి వర్ధంతి సందర్భంగా పిల్లలను ఇంటి వద్దకు పిలిచి భోజనం పెట్టడం అనేది చాలా అభినందించదగ్గ విషయమని సాధారణంగా ఆశ్రమాల వద్దకు వెళ్లి వారికి అన్నదానాలు చేయడం జరుగుతుందని కానీ ఇంటి వద్దకు పిలిచి వారికి ఆప్యాయంగా మనం అన్నం పెట్టడం వలన బంధువుల ఇంటికి వచ్చిన భావన మనసులో ఏర్పడి వారు ఆనందంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కె శ్యామల, దివ్యేష్, డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ అలై కే సతీష్, జెడ్సి అలై మన్యం దుర్గ సుభద్ర, క్లబ్ జాయింట్ సెక్రటరీ అలై మద్దా వికాష్, డీసీ అలై ముద్దున వెంకటేష్, అలై కట్టా జగన్ మోహన కిషోర్, అలై సిహెచ్ గణేష్ పాల్గొన్నారు.

కాట్రేనికోనలో తాచుపాము దర్శనం

స్నేక్ క్యాచర్ వర్మ పట్టివేత

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన గ్రామంలోని రజకుల వీధిలో భారీ త్రాచు పాము శనివారం మధ్యాహ్నం ఓ ఇంటిలో దర్శన మివ్వడంతో స్థానికులు భయభ్రాంతులయ్యారు. త్రాచు పాము సమాచారాన్ని భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ వర్మకు తెలపడంతో ఆయన హుటా హుటిన కాట్రేనికోన వచ్చి ఇంటిలోని పామును డబ్బాలో బంధించారు. చుట్టుపక్కల వారు పామును చూడడానికి తరలివచ్చారు. పాము దొరకడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్నేక్ క్యాచర్ వర్మ మాట్లాడుతూ సురక్షిత ప్రదేశంలో పామును వదిలిపెడతానని తెలిపారు.

ఎగైనెస్ట్ విమెన్ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా విద్యార్థులకు మరియు మహిళా అధ్యాపకులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం డిఎస్పి కె లతా కుమారి ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా లతా కుమారి మాట్లాడుతూ మహిళలు సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళలకు ఆర్థిక స్వతంత్రం కలిగి ఉండాలని, ముఖ్య నిర్ణయాలను తీసుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గృహ హింస గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డా కె రవి శంకర్ ముఖ్య అతిథి లతా కుమారికి ఆదిత్య మెమొంటో అందజేశారు. ఈ సదస్సులో ఇంటర్నల్ కంప్లైంట్ కో ఆర్డినేటర్ ఏ శ్వేతా, మహిళా ఉపాధ్యాయులు, మహిళా విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేయాలి

వ్యవసాయ శాఖాధికారి పి.గాంధీ

విశాలాంధ్ర - శంఖవరం : వచ్చే నాలుగు రోజులూ తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని శంఖవరం మండల వ్యవసాయ శాఖ అధికారి పి గాంధీ సూచించారు. శంఖవరంలో వరి నూర్పుడిలను రైతులతో పరిశీలించి సూచనలు ఇచ్చారు. తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కోసిన పంటను కుప్పగా చేసుకోవాలని లేదా నూర్చు కోవాలని కోరారు. నూర్చిన ధాన్యాన్ని తేమ శాతం పరిశీలించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని, సాధారణ వరి రకం 75కి.లకు రూ.1637 మరియు ఏ- గ్రేడ్ రకం 75కి.లకు రూ.1652 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుంది అని వివరించారు. రబీ వరి సాగు నీటి అనుకూలతను బట్టి నారు నాటే పద్దతి లేదా వెదజల్లే పద్దతిలో డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలి అని తెలిపారు. అపరాలు వరి మాగాణిల్లో డిసెంబర్ 15లోగా వేసుకుంటే మంచి దిగుబడి పొందవచ్చు అని వివరించారు. ఏఓ వెంట రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలు, ఫార్మసి పాలిటెక్నిక్ మరియు బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాలల్లో ఆయా ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకుని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు "రాజ్యాంగం ఆవశ్యకత " అనే అంశం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయా కళాశాల ప్రిన్సిపల్స్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగ యొక్క ఆవశ్యకత, ప్రాథమిక విధులు, ప్రాథమిక హక్కులు గురించి వివరించారు. అలాగే రాజ్యాంగం రూపకల్పన అందు పొందుపర్చిన అంశాలు గురించి విద్యార్థులకు చర్చాగోష్ఠి ద్వారా వివరించడం జరిగింది. ప్రతి ఒక్కరు జాతీయ జెండా, జాతీయ గీతాన్ని, రాజ్యరంగాన్ని గౌరవించాలని తెలియజేసారు. ప్రిన్సిపల్స్ డా ఎం శ్రీనివాస రెడ్డి, డా డోలా సంజయ్, డా ఆదిరెడ్డి రమేష్, డా కె రవిశంకర్, డా డి సతీష్ కుమార్, డా సంజయ్ కుమార్, విలాస్ చవాన్, ఎస్టివిఎస్ కుమార్, ఆయా కళాశాలల వివిధ విభాగాల అధిపతులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వాలంటీర్లు పాల్గొన్నారు.

కుండలేశ్వరంలో పశువుల హెల్త్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఆరోగ్యశ్రీ కార్డుల తరహాలో పశువులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డులు అమలు చేస్తుందని పశుసంవర్ధక శాఖ కాట్రేనికోన మండల పశువైద్యాధికారి డాక్టర్ యామిని అన్నారు. శనివారం మండలంలోని కుండలేశ్వరం పంచాయతీ రైతు భరోసా కేంద్రం వద్ద పశువిజ్ఞాన బడి నిర్వహించి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేశారు. డాక్టర్ యామిని మాట్లాడుతూ పశువులు జీవాలు కలిగిన పశుపోషకులకు పశు ఆరోగ్యకారులు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యం ఆరోగ్య సంరక్షణ చర్యలు కృత్రిమ గర్భధారణ మరియు వ్యాధి నిరోధక టీకాలు అన్ని ఈ కార్డు ద్వారా సేవలు అందిస్తారని మరియు పాడి పశువుల యొక్క వివరాలు అన్ని ఈ కార్డులో నమోదు అయ్యి ఉంటాయని తెలియజేసినారు. అలాగే ఈ కార్డు పూర్తిగా రైతు వివరాలతో ఆన్లైన్ చేయబడి ఉంటుందని తెలియపరిచారు. ఈ కార్డుపై హాలోగ్రం స్టిక్కర్ ఉంటుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, పశుసంవర్ధక సహాయకులు గొలకోటి గాంధీ పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ సామాజిక బాధ్యత

విశాలాంధ్ర - అమలాపురం : విద్యార్థినీ విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ను మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వయించుకుంటూ అవగాహన పెంపొందించుకునేందుకు వీలుగా భారతీయ స్టేట్ బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు మంజూరు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని మద్దాలి వారి పేట సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం నెంబర్ 3కి టెలివిజన్ను భారతీయ స్టేట్ బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయగా ఆ యొక్క టెలివిజన్ను శనివారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక అవసరాలైన విద్య వైద్య రంగాలకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు అందించి సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం వహించి కీలకంగా వ్యవహరిం చాలని కార్పొరేట్ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ వీఐపీ నాయుడు, 14వ వార్డు కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, పదో వార్డ్ కౌన్సిలర్ దుర్గాబాయి, భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రతినిధి రమేష్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని పి జ్యోతిలక్ష్మి దేవి, వసతి గృహ సంక్షేమ అధికారి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బి.యశ్వంత్‌కు సిల్వర్ మెడల్

విశాలాంధ్ర - అమలాపురం : కర్నూల్‌లో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 67 కేజీల భాగంలో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్‌కి చెందిన బి యశ్వంత్ స్నాచ్ 86 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 110 కేజీలు మొత్తం 196 కేజీతో రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానంలో సాధించి సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నాడు. అలాగే 61 కేజీలు విభాగంలో పి తరుణ్ తేజ 115 కేజీలు బరువెత్తి నాలుగు స్థానాన్ని గెలుచుకున్నాడు. ఈ ఇరువురికి క్రీడాకారులను కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు యనమల కృష్ణ పద్మరాజు, అసోసియేషన్ సభ్యులు చీకురుమెల్లి కిరణ్ కుమార్, ఎంవి సముద్రం, పోనకల దుర్గాప్రసాద్, బి అప్పన్న మరియు హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ క్రీడాకారులందరూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారని కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు.

నాటు సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: అక్రమంగా తెలంగాణాకు నాటు సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లు ఎస్ ఐ బి సురేంద్ర కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా నాటు సారాయి తరలివస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో తెలంగాణా సరిహద్దు లంకాలపల్లి చెక్ పోస్టు వద్ద శనివారం తనిఖీలు నిర్వహించి రెండు లీటర్లు నాటుసార స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రామకోటయ్య గూటికి చిన్నంపేట మాజీ సర్పంచ్

విశాలాంధ్ర చాట్రాయి: రామకోటయ్య గూటికి చిన్నంపేట మాజీ సర్పంచ్ కునికేరి నాగమల్లేశ్వరరావు (డాక్టర్ బాబు) చేరుకున్నారు. కాట్రా మండలం చిన్నంపేట గ్రామానికి చెందిన చిన్నంపేట గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఆర్ఎంపీ వైద్యుడిగా చుట్టుపక్కల గ్రామాలతో మంచి ప్రజా సంబంధాలు కలిగిన వ్యక్తి. శనివారం వారి నివాసానికి రామకోట వెళ్లి తనతో కలిసి పని చేయాలని కోరడంతో కునికేరి నాగమల్లేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. రామకోటయ్య డాక్టర్ బాబు ను చాలువతో సత్కరించారు.

అభివృద్ధికి సీఎం కృషి

విశాలాంధ్ర - ఆకివీడు: ప్రతి సామాన్యుడి సంక్షేమం, ప్రతి గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ అని. డిసిసిబి చైర్మన్, ఉండి నియోజక వర్గ వైకాపా ఇంచార్జ్ పివిఎల్ నరసింహారాజు అన్నారు. శని వారం మండలంలోని ఐ భీమవరం గ్రామంలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందే విధంగా వాలంటరీ వ్యవస్థ ద్వారా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నిత్యం రాష్ట్ర ప్రజల గురించి ఆలోచించే ముఖ్యమంత్రి అన్నారు. జగన్ రానున్న ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి బ్రహ్మరథం పడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేక్ రసూల్ బిబి హుస్సేన్, జడ్పిటిసి ఎండగండి శ్రీను, ఎంపీపీ కటారి జయలక్ష్మి, ఐ భీమవరం గ్రామ సర్పంచ్ గాలి సామ్రాజ్యం, గొట్టుముక్కల బాబ్జి రాజు, అల్లూరి సుబ్బరాజు, తస్సెల్ రాజు, కమతం మహేష్, అద్దంకి ప్రసాద్, ఎల్ వి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు,, ఎంపీపీ విజయ నరసింహారాజు అన్నారు. శనివారం భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి. అనంతరం మాట్లాడుతూ. వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల శ్రేయస్సు కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా 13,500 పెట్టుబడినిది రైతు శ్రేయస్సు కోసం 0 వడ్డీ చేయడమే కాకుండా మధ్యవర్తులు దళారులు లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ప్యాడ్ సీఈవో ఎన్.వి సుబ్బారావు,భీమవరం మండల వైసిపి యూత్ కన్వీనర్ కామన మహేష్,జిల్లా వ్యవసాయ అడ్వైజర్ కమిటీనెంబర్.కుటుంబరావు, ఏఎంసీ మెంబర్ కట్టేటి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు రైతులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

- ఎస్ఐ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - గణపవరం: విద్యార్థులకు రోడ్డు భద్రతా పై అవగాహన కార్యక్రమం గణపవరం చైతన్య స్కూల్ విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణపవరం ఎస్ఐ వేములవెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు 18 సంవత్సరాలు లోపు ఉన్నవారు వాహనములు నడపరాదని అది చట్టరీత్యా నేరం కింద పరిగణించబడుతుందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను రోడ్డుమీదప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్ ను పాటించాలని అన్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎటువంటి నియమ నిబంధనలు పాటించాలని విద్యార్థులకు ఎస్ఐ వివరించారు. విద్యార్థులు రోడ్డు భద్రత గురించి ఫ్లెక్సార్లు పట్టుకుని స్లోగన్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు రాంప్రకాష్, ఏజీఎం పార్థసారథి, కోఆర్డినేటర్ రామారావు, అకాడమిక్ డీన్ ఏసుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

విశాలాంధ్ర-ముసునూరు: మహిళలు అన్నిరంగాల్లో ముందుంజలో వుండాలని ముసునూరు మండల ఏపిఎం కుంటం బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముసునూరు గ్రామంలో మండల పరిషత్ కార్యాలయం నుండి మండపం సెంటర్ వరకు మహిళ సమైఖ్య సభ్యలతో కలిసి ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం మాట్లాడుతూ మహిళలు గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం అన్ని రంగాల్లో ముందు వరుసలో వుంటు న్నారని, అదేవిధంగా మహిళల పై జరిగే ఆవరోధిక చర్యలునివారించదానికి ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు పెట్టిన అగడం లేదని,ఇంకా మరోన్నే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహాత్ముడి కలలు సాకారం

విశాలాంధ్ర-ముసునూరు : మహాత్మగాంధీ కలలు సాకారం చేయ దానికి ఆంధ్రరాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి కావడం మన అదృష్టమని జడ్పటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయసలు కోని యాడారు. శనివారం మండల కేంద్రమైన ముసు నూరు 1 సచివాలయం పరిధిలో ఎంపిడిఓ జి.రాణి ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సచివాలయం -1 పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన సంక్షేమ పధకాలు,అభివృద్ధి ప్రణాళిక బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు మల్బారి నాగ వల్లే శ్వరరావు,ఎంపిపి కోండా దుర్గాభవానీ వెంకట్రావ్,రేగుల గోపాలకృష్ణ,తులిమెల్లి రంగారావు ,ఒపిఆర్డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సీనియర్ ఆసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు,జూని యర్ సన్నీరాజన్,పంచాయితీ కార్యదర్శిలు ఆరేపల్లి వెంకటేశ్వరరావు,ముప్వ స్రవంతి,తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వాడపల్లి గ్రామంలోని స్వామివారి గోవింద స్వరాలతో మార్మోగిన చందన వెంకన్న క్షేత్రం కోనసీమ తిరుమల తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కలియుగ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగ పద్మావతి సమేతంగా కొలువై ఉన్న వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్ర నలుదిక్కుల నుండి భక్తులు తరలివచ్చి ఏడువారాల వెంకన్నను దర్శించుకున్న దివ్య ఆశీస్సులు పొందుతున్నారు.